కథ :

# సావుకర్చు

**సువర్ణముఖి**

కరెంటు తంబామ్మీద ఎవులో ఎక్కి చుట్ట కాలుతున్నట్టగ ఎర్రగ రంగ ప్మొరపకాయనాగ ఎలుగెలిగి పోతుంది, కరెంటుబుడ్డీ.

అచ్చిలు, అంగబంగాలు, దోప్డీలు దౌరుజన్యాలు, దురమారగాలా, కుచ్చి తాలు, కుతంత్రాలు, అర్ధరాత్రి ఉన్నోలు హాయిగా తొంగున్నప్పుడు అనాదోళ్ళ అరి చిన ఆకలి అరుపులు, పట్టపగలు బట్టబయలుగా చెట్లుకికట్టి కాల్చిడాలు యిన్ని జరుగు తున్నా, ఏమీ పట్టించుకోకుండా, యెదవబతుకు బతుకుతున్న యెదవల్లాగ, ఎలుగు తుందంటే ఎలుగుతుందే, ఎర్రగ ఎలుగుతుంది గవరమెంటుగోరి ఈదీపం.

నల్ల సిమిడిపిక్కలాగ, దాన్లోని సిమిడిలాగ, కల్లకాటుకలాగ, బండి కందెన లాగ చిక్కటి చీకటి.

ఆ చిక్కటి చీకట్లో సూరమ్మ నుదుటిన బొట్టులాగేవుంది జాతపోల్ల పీదిలో కరెంటుబుడ్డీ. దాని వెలుతురు దేనిమీదా పడలేదు, దానిమీదకూడ.

వెండి పోకలాగ పారత్తంది ఏరు. కొండమీదున్న సవరోళ్ళ సెమటే గావల వూటల్లాగ అలగ కారికారి ఒక దగ్గర చేరిచేరి ఇలా పారత్తంది. అది తిన్నగ 'వనజ' పండావోడి భూమిలోకి, దాన్నించి 'జియ్యమ్మవల్స' మండవాదికోరిగోరి భూమిలోకి ఎల్లిపోతాడి.

---

కొడుక్కు కొత్తబట్టలు అందించడం గుర్తొస్తుంది
పాలపిట్టను చూచి కేరింతలుకొట్టి మిత్రులందరూ
జొన్నకంకి బంగారంతో కౌగిలించుకోవడం గుర్తొస్తుంది
అమ్మ సంజీవని హస్తాలకన్నా....
ప్రియురాలి గాజుల చేతుల గజ్జెల కాళ్ళసవ్వడికన్నా....
నువ్వంటే అన్నిటికంటె ఎక్కువిష్టం
జాగ్రత్త తల్లీ !
యుద్ధం పదిలం ! బిడ్డలు పదిలం ! !

సవరోళ్ళ సెమట అక్కడ సరుకై పోద్ది. సంపదొచ్చి ఆల టంకుపెట్టిల చేరి పోద్ది. ఇక సరుకు అంచెలంచెలుగా అమెరికా ఎలిపోద్ది. నేప్పోతే రయ్యేమని రష్యా ఎలిపోద్ది. ఏదైతే మనకు ఎందుకుగాని.

అదిగో ఆ ఏరు అవతల నిలబడ్డారు పోలీసోళ్ళు. ఏట్లోకి జీపిరాదుగనుక.

ఏంతలోతు ? ఏటిమంచి ? ఏటిచెడ్డ. బురదా ? ఇసకా ? ఇవేవి ఆలోచించ నవసరం లేకుండా రాలు కనబడతన్నయ్.

దిగిన దగ్గిర ఎక్కిన దగ్గిర ఇక్కలు కుమ్మడంతోటి జార్తంది. ఎపులో జారి పోన్రు. ఉత్తిలోన తప్పోయిందిగాని నేప్పోతే కాలే యిరిగిపోను.

నిన్నటిదాకా పాలపిఁగడలాగ, పంతులోరి పంచిలాగ మరీ తెల్లగా కాక పోయినా, సవరోడి గోసిలాంటి మాసిన తెలుపులాగైనా వుండేది వెన్నెల. అమావస్యా రోజులు వచ్చేసినాయి. కళ్ళు చీరుకుంటే ఎలాగ కనబడదుగాని కంట్లో వత్తులేసు కున్నా కనబడ్డంలేదు.

ఏరుదాటతన్నరు ఒకలుకాదు ఇద్దరుకాదు.... అలాగని ముగ్గురూకాదు... ముప్పైమంది. ఆలకీ అందరిలాగే రెండేసికాళ్ళు రెండేసి చేతులూ, ఒకబుర్రా, మెదడు గురించి తేలీదూ, ముప్పై రెండించీలపైనే ఛాతివుంది. అయితే మూడించీల గుండెవుందా అది నిమసానికి ఎన్నిసార్లు కొట్టుకుంటుంది, అసలాలకి గుండెకా యుందా, ఊపిరితిత్తులున్నాయా ? అందులోంచి వూపిరొత్తందా ? అదీ ఎగూపిరా ! దిగూపిరా ? ఆలకి దమనులు సిరలు వున్నాయా ? అందులోంచి రక్తంపార్తందా ? బయిం పార్తందా ? అవేవి పట్టించుకోకపోతే, పరిగనలోకి తీసుకోకపోతే, సరిగ్గా నిక్కచ్చయిన మనుషులు ముప్పైమందున్నారు.

డియెస్పీగోరు మరో ఆరుగులు దాటీసేరు. ఒకలుకొకలు దాటతన్రు.

వెనుకనున్న ఇద్దరు కానిస్టేబుళ్ళు మెల్లిగా మాట్లాడుతున్నారు ఒకరు కసింత సీనియర్. ఇంకొకడు తేరీక కొత్తోడు.

కొత్తోడు అడిగాడు —

"గురువుగారూ ! నాకు తెలీక అడుగుతున్నా ...ఈ సికాకులమ్ల అంత పెద్ద పోరాటం జరిగిందాట కదా ! అప్పుడు సేనా బాధలు పెట్టారట ఇళ్లలు కాల్చేసాలు ...

1164

అడోళ్ళని చెరిసీడాలు....పంటలు నాశినం చేసీడాలు....ఇంకెలెటో చేసినారటకదా ! అయినా....జిడవకుండా మళ్ళీ ఈలు నచ్చులైట్లుతోటి ఎందుకు చేరినారంతారు" అడిగాడు శిష్యుడు కాని శిష్యుడు గురువుకాని గురువుని.

గురువుగారు ఇలా సెలవిచ్చారు—

"నీకూ-నాకూ సిగ్గునేక ఈ నౌకరీల చేరినాం. చాలీచాల్ని బతుకులు బతుకు తున్నాంగాని - సీమూ-రక్తమూ వున్నోడు ఎవుడయ్యా కుక్కలు కక్కేసిన కూటికి ఆశపడతాడు ? నానా యిబ్బందులు పడినా నాలుగు రుచులూ కోరుకోడు" అన్నాడు గురువు. లాగిలంపకాయ కొట్టినట్టయింది శిష్యుడికి.

అందరూ దాటిపోనారు. ఏరైతే దాటిగే దాటిపోనారుగాని ఎదురుగ మరిడమ్మ లాటి గాటీ జూసి గుండె జారిపోయింది. కాని తప్పుకాదా ! అ గాటీ మీదన్న గూడకే వారి ప్రయాణం.

"చేసింది చచ్చురోడి పని అబ్బా ! చెండాలమంటే అవుతాదా పద పద" అన్నాడు ఇందాకలు గురువు కాని గురువు. శిష్యుడు గురువుగారి బాటలో నడిచీసాడు.

అందరూ గాటీ ఎక్కుతున్నారు లేతలేత జొన్న సేని, గంటిసేని, కొర్రలు వాళ్ళ కాళ్ళకు అడ్డు పడుతున్నాయి. ఎవులో జొన్నమొక్క కుమ్మేసారు. అది మొదలు కొన్ని వందల మొక్కలు ఏడ్చుకుంటూ విరిగిపోయాయి.

అవి పోలీసోళ్ళు పట్టించుకోలేదు. ఎవరు చస్తున్నారు ఎవరేడుస్తున్నారు.... బిడ్డల్ని చంపితే తల్లులెంత బాధపడతారు గూడేలు కాల్చితే మూగజీవులు ఎంత కుమిలిపోతారు. ఇవన్నీ ఆలోచించినోళ్ళయితే-అ నౌకరిలోనే చేరకపోదురు.

అగాటీ కొంచెం పైకి ఎక్కి వంపు తిరిగేసరికి గూడెంలో ఓ ఇంటిముందు చిన్న మంట కనిపిస్తుంది. గూడేమంటే గూడెమే-మూడేమూడిల్లు. ఆ మూడూ ఒక్క కుటుంబమే. కుటుంబ పెద్దే గూడేం పెద్ద. పేరు బిడ్డిక యెంకన్న. యెంకన్న ఇంటికి ఇవతలింటిలో వాళ్ళ తమ్ముడు ఉండేవాడు. లేడు చనిపోయాడు. అతని పెళ్ళం పిల్లలు వుంటున్నారు. అవతల పక్కింటిలో యెంకన్న పెద్దకొడుకు యేరుపాటుగా కాపర మెట్టాడు.

1165

ఇసిరేసిన కూడు మీదకి కుక్కలు కలబడినట్టు వెళ్ళి మూడిళ్ళమీదా పడ్డారు పోలీసులు.

కుక్కల్లా ఆలు కలబడితే వెంకన్న పెంపుడు కుక్కలు కలబడ్డాయి. ఆల తుపాకులు జూసి నిలబడి అరిచాయి.

అందరూ అగ్గి బుట్టినట్టు గాబరా గాబరా లేచిపోనారు. అప్పటికే ఎంట తగిలిన ఎలక పిల్లల్లాగ అన్ని మూలలు నెలికేసారు పోలీసులు.

ధీమాగా బయటకొచ్చారు. బయటకొచ్చేసరికి ఇంటిముందు మండుతున్న కర్రలకి బొగ్గు రాల్చి మళ్ళీ మంట ఎత్తిరించాడు వెంకన్న.

బయటకొచ్చిన పోలీసుల్లో కొందరు అటూ ఇటూ చూత్తన్నరు. అది వాళ్ళ పద్ధతో లేక వాళ్ళకిచ్చిన శిక్షణో లేక ఎవల మట్టుగ వాళ్ళకి బయమోగాని చుట్టూ చూత్తన్నరు.

D.S.P.గారు మాత్రం దొడ్డిలో మంచి పొజిషన్‌లో నిలబడి—

"ఆ....నీ పేరేటివోయ్"- అడిగాడు

"బిడ్డి వెంకన్న...."

"ఆ....ఏటి సంగతి? అన్నగాళ్ళకు తిండి తిప్పలు పెట్టి ఆదరిత్తున్నావట.... హా...." అన్నాడు D.S.P. బయాన్ని బయటకు పొక్కకుండా.

D.S.P.గారు సామాన్యులుకారు. మంత్రులు చేసే రిగ్గింగ్‌లలోనూ, వాళ్ళ కూతుళ్ళు చేసే ఏక్సిడెంట్‌లలోనూ, వాళ్ళ కొడుకులుచేసే మర్డర్‌లలోనూ, మాన బంగాలలోనూ అన్నింటిలోనూ ఉన్నోలికి సేవచేసి ఉన్నతమైన పదవిలోకి వచ్చిన వారు. అందుకే ఎదుటి వ్యక్తి గంభీరంగా మాట్లాడనంతవరకూ గంభీరంగానే మాట్లాడతారు.

వెంకన్న సెకలించాడు. సెకలించి—

"ఎపుడన్నాడు....నిన్నగాక మొన్న నాను జెయిలుకెళ్ళొచ్చినాను. అస్సలు జెయిలు కెందుకెళ్ళినానంటే నచ్చలైటు కేసుమీదే జెయిలుకెళ్ళినాను. తిరిగొచ్చిన తర్వాత ఆలు కలకే నానిలగ ఉండిపోన్ను. కలిత్తే నానెందుకు ఇంటికాడుంతాను. అన్నాడు గంభీరంగా D.S.P. సుదుటిన వాసం మేకు దిగ్గొట్టినట్టు.

1166

D.S.P.గారికి వుండవలసినన్ని హోదాలు D.S.P.గారికున్నాయి. మరి యెంకన్నగారికి లేవా ? ఎందుకులేవు—

శ్రీకాకుళ పోరాటంలో సాపుకార్లతోని పారెస్టోళ్ళతోని ఉద్దంజేసి జెయిలు కెళ్ళి, జెయిల్లోన దెబ్బలాడి తిని, తిరిగొచ్చినోడు. అందుకే అలగ చెప్పినాడు.

D.S.P.గారు వూరుకోలేదు. అసలే గవరమెంటుకి పెద్దకొడుకులాటి పోలీసు డిపార్ట్ మెంట్ లోని మనిషి—

"ఏయ్....ఎవడితో మాట్లాడతన్నవో తెలుసా" కోపం చూపించడానికి ప్రయత్నించారు.

"అపున్ బాప్....వున్ని మాటంతే వూర్నాయిడికి కోపమొత్తాది ... ఏ అన్నగాళ్ళ రానేదూ ఆలకి నాను తిండెట్టనేదు. అవన్నీ వదులుకోనే ఇల్ల కొండ చేసుకుంతన్ను" అన్నాడు యెంకన్న

వాళ్ళ అలా మాట్లాడుతుంటే పసిపిల్లలనుంచి ముసిలోళ్ళదాకా అలా చూసు కుంటూ వుండిపోనారు.

"వాళ్ళను ఆదరించేవని తెలిస్తే....కొండకిందికి దిగిపోవాలిసొస్తాది జాగ్రత్త" హెచ్చరించినట్లు మాట్లాడి వెనుదిరిగారు D. S. P. బృందం.

అసలే మందు పాతర్ల రోజులు! అందులోకి కలికాలం! కాకపోతే మరింకేటి అంధ్రా నచ్చలైట్లాట మధ్యప్రదేశ్ అంచుల్లో మందుపాతరపేల్చి మహారాష్ట్రా పారి పోనారట. అందుకే గాబరాగాబరాగా కొండ దిగేసారు.

వాళ్ళు అలా కొండ దిగుతుంటే యెంకన్న దగ్గరనుంచి యెంకన్న పెద్ద కొడుకు సుబ్బారావువరకూ అలాగే ఆగి చూసుకుంటూ వుండిపోయారు.

మళ్ళీ ఎవులో మంట రాజేసారు. సుబ్బారావు గడపలో పరచిన తన పడక దగ్గర కెళ్ళాడు.

తన పడక చూసేసరికి ఆడికి ఏడుపొచ్చింది. అది ఎవులో పోలీసోడు బూటు కాలుతో కుమ్మేశాడు. దాన్ని పట్టుకొని —

"అమ్మా....ఇది చూడే! .... దీనిమీద నాను తొంగోనుకదా....ఉ....ఉఉ.... నాను తొంగోనుకదా!" ఏడిసినట్టు గునిసాడు.

1167

అందరూ దాన్ని చూసారు, అందరికీ బాధనిపించింది.

"అటుండి ఇటు తిప్పేసి పర్చుకోరా" అన్నాది తల్లి.

"నా కోద్దు కదా! నా కొద్దుకదా! నా కింకొకటి కావాలి కదా!" అని గుణుపు పెంబాడు. వాళ్ళమ్మకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదు.

"అయ్యో నా కొడుకు తెల్ల బట్టలు కోరాడా? తెల్లటి మెతుకులు కోరాడా! మరొక్క గుడ్డ పాత కోరాడు. అడికి ఇవ్వడానికి గుడ్డపాత లేదు. నాను కట్టుకోడానికి గుడ్డముక్క నేదు. పరుసుకుంతే కప్పుకోడానికి లేపు - కప్పుకుంతే - కట్టుకోడానికి నేపు. ఈ దిక్కుమాలిన బ్రతుకులు ఎప్పుడు పోతాయో....అని ఆవిడ ఆలోచించలేదు. ఆవిడ ఆలోచనంతా —

అయ్యో ఇంటిల గుడ్డ ముక్కలు నేని సంగతి ఎప్పుడు తెలుసుకుంటాడో పున్నదాన్తో సర్దుకోడం ఎప్పుడు నేర్చుకుంటాడో అన్నదే ఆవిడ ఆలోచన.

ఇలాంటి ఆలోచనల్లోంచి సిరాగ్గా మామ యెంకన్న దిక్కుచూసి —

"మ్మామ....అన్నగాల్ని రానివ్వద్దు మామ" అన్నాది. అని తల కిందికి దించుకుంది.

కోడలు తలకిందకి దించుకుందిగాని యెంకన్నకి తల తీస్నేసినట్టయింది. అందరూ పల్లక ఆలోచిస్తున్నారు. యెంకన్న మనుమడు సుబ్బారావు మాత్రం యేడుస్తున్నాడు.

ఇంతలో ఏవో రంగు రంగుల పురుగు మంట దగ్గర కొచ్చింది. సుబ్బారావు ఏడుపుని ఆలమ్మ ఆపలేక పోయిందిగాని, ఆ పురుగు ఆపేసింది.

దాని పట్టుకోడానికి నెగిసాడు. అది తిన్నగెల్లి యెంకన్న తమ్ముడు భార్య అంతే సుబ్బారావుకి చిననాయనమ్మ అవుతాది. ఆవిడ కాళ్ళమీద వాలింది. నెమ్మదిగా దాన్ని పట్టుకోడానికి చెయ్యి పెట్టాడు.

టపుక్కున ఓ నీటి బొట్టుపడింది. అది నీటిబొట్టుకాదు కన్నీటిబొట్టు. సుబ్బారావుకి అదోలా అనిపించి వాళ్ళమ్మ దగ్గరకొచ్చి —

"అమ్మా - చిన నాయినమ్మ ఏడుత్తందే" అన్నాడు.

అటుచూడలేక అందరికీ ఏడుపొచ్చింది. యెంకన్నతోసహ అందరికీ గతం గుర్తుకొచ్చింది.

ఇందాకటినుంచి యెంకన్న తమ్ముడు భార్య అంటున్నానే. ఆయమ్మ పెనిమిటి చచ్చిపోనాడు అంటున్నానే అదంతా అబద్ధం. ఆయమ్మ పెనిమిటి చచ్చిపోలేదు. పోలీసులు చంపేశారు. శ్రీకాకుళ పోరాటంలో చనిపోయిన కా॥ గంగన్నే ఆయమ్మ పెనిమిటి.

అందుకే ఏ చిన్న విషయం జరిగినా ఆయన గేపకమొత్తాడు. ఆయన గేపక మొచ్చినప్పుడల్లా అవిడ ఏడుత్తాది. ఆవిడ ఏడ్చినపుడల్లా పిల్లలూ ఏడుత్తారు. గూడంతా ఏడుత్తాదీ.

గేపకాల్లోంచి తేరుకొని యెంకన్న భార్య —

"ఊః.....అన్నగాల్ని రానివ్వద్దూ!" అన్నాది.

కోడలంటే చిన్నపిల్ల గవాటకి (పోరాటంకి) పుట్టలేదు. అందుచేత కొండల్లో రాజకీయాలు కొత్త. కాని తన పెళ్ళాంకి ఆ రాజకీయాలు కొత్తగాదు. కాని కొత్తగా మాట్లాడితే తను పాతకత చెప్పక తప్పలేదు.

జరిగిన అలజడి నుండి ఎవరికీ నిద్దర్రాలేదు. అందరూ అలాగేకూకోని యింతన్నరు. అందరినీ ఉద్దేశించి పెళ్ళాం వైపు చూసి —

"ఓలే... ఆ అన్నగాళ్ళు, అంతే, అప్పుడు కామిరెడ్డిలే (కామ్రేడ్‌లే) నేక పోతే మన మిలగుంతామూ? ఈ కసింతో కుసింతో గెంజి తాగుదామూ? ఈ పాటిదో ఆపాటిదో గుడ్డ కట్టగలమా చెప్పుమీ? —

కర్ర గొడితే కేచు (కేసు) రెమ్మరిత్తే కేచు! పుల్ల ఏరితే కేచు! పింజితెంపితే కేచు! కియ్యమంతే కొడెత్తు రెలిపోయేాలు! మాటాడితే మేకెత్తురెలిపోయేాలు! గొడ్డ లొట్టుకొని అడివిలోకెల్లి, అలకి కనిపించితే, ఆ గొడ్డలితోనే దెబ్బలు! కడవరికి (చివరికి) ఆ గొడ్డలి నాక్కాని కేచెట్టి కోరుట్ల తిప్పేలు. అడు బొక్కల తోసేమని తీర్పు యిచ్చేడు.

అలాపింటిదీ ఇప్పుడే పారెస్టోడుఅడివిలో కొచ్చి నాక్కాని తిరిగెలిపోగల్లు కొండలనిండ పంటలేచినాము. ఇదెవులువల్ల జరిగింది చెప్పీ....?

ఆలోకపక్క అలగైతే ఇంకొకపక్క పొండోలు, సావుకార్లు, ఇచ్చిన అప్పులు తీర్సకపోతే, ఉన్ని మడి చెక్క రాసుకుండోలు. ఇంటిలున్న గింజలు వొంపికెలిపోయేాలు. ఆలిట్టమొచ్చిన పేటుకి మన దినుసుకొని దొబ్బెలిపోయేాలు.

1169

అలాపింటిది సంతలోన రేటులు మనం చెప్పినాం పసుపింత, అల్లమింత, ఉ .... కందులింత, మరి....చింతపండు కింతివ్వాలి ఇలగ చెప్పినా, సంతకెలితేనే బితుకు బితుకు మన్నే మనం ఇదంతా ఎపులువల్ల చేసినామే!

ఇవన్నీ చెప్పినోలు చెల్లిపోనారు....మన బతుకులు బాగునేవు ఎపుడునాగీ అయ్యిపోసం అనీసరికి అన్నగాలొచ్చినారు అలురాడం మనకి కట్టమా చెప్పే.... ? అన్నాడు యెంకన్న.

అందరూ అలాగే అన్నారు. యెంకన్న పెళ్ళాంకూడా విన్నాది మళ్ళీ ఇలా అడిగింది.

"అపునూ .... కాయమే.... అవన్నీ చేచిందీ అలే! మన్క కొండ దించేత్త మంతే మన మెలగా బతకాలి చెప్పు....!

నానాలకి తిండెట్టసన్నా నా....నే పోతే నానంత పీసుదాన్నా అలకి తిండెట్టడం నాకిట్టమే .... అల మాటలా ఇట్టమే .... అల పాటలు ఇట్టమే .... గాని అలకి తిండెడితే, పోలీసులు కొడితే, మరెందుసు అలకెట్టాల" అని అడిగిందీ అమాయకంగా కాదు చాలా ఆలోచించి.

ఏటిచెప్పుతాడా అన్నట్టు చిన్న గుంటడు సుబ్బారావు సుంచి చిన్నాయనమ్మ దాకా అందరూ చూసారు.

"అపునే!.... ఇదిగోయే ఈమంటుందే.... పొగరాకుండా ఈ మంట వత్తాదేటీ? .... ఊది ఊత్తె పొగంతా పోయి ఎర్రగ ఎలుగుతుందే....

ఉన్నోలు-నేనోలు తేడా నేకుండా అందరను సమంగ అయిపోవాలంతే కపుకులు నేకుండా అయిపోద్దేటీ ?.... ఈ మాత్రం కపుకులు పడకుండా ఏసుకమూ రాదే.

మనకైతే పాకలే దూరత్రను పాత గుడ్డలే కప్పుత్రను, అలు కనబడితే మరిన్ని మాటలు నేకుండ కాల్చేసి సంపిత్తరే" అన్నాడు యెంకన్న.

"అమ్మో అన్నగాళ్ళనై తేసంపిత్తరా" అన్నట్టు గుటక మింగింది కోడలు. యెంకన్న పెళ్ళం కసింత బాధపడ్డాది. సుబ్బారావు అపులింత లేస్తుండగా—

ఇందాకటి మిసుకు మిసుకు లైటు వక్కసారి జిగేమని ఎలిగింది. యెంకన్న కోడలు తన చెయ్యి తానే ముద్దాడుకొంది.

1170

ఆవిడిది నీలకంఠాపురం దగ్గర రోడ్డోర పూరు. ఆ పూర్లో ఒకరిద్దరు ఉద్యోగస్తుల పెళ్ళాలున్నారు. వాళ్ళు ఇలగే కరెంటు వచ్చేసరికి చెయ్యికి ముద్దెట్టుకోవడం చూసినకాసి ఆవిడ అలగే చేస్తుంటాది.

ఇప్పుడిదాకా మినుకు మినుకు మన్న లైటు వక్కసారి ఎలిగీసరికి సుబ్బారావ్‌కి ఆశ్చర్యమేసింది—

"తాతా....ఆ నైటూ....ఎందుకలగ జిగీలుమని బెలిగింది" అడిగాడు.

యెంకన్న సమాధానం చెప్పకముందే యెంకన్న పెళ్ళం తెలిసినట్టగ టపుక్కున అన్నాది— "వతీనుకాటి పైర్లు కలిపీసి వత్తేగేసి వుంతారు. అందుకే బెలిగింది." అన్నాది....

యెంకన్న నవ్వి—

"—అదికాదే పేట్రీలు....మిల్లులు మిసన్లోలు ఇప్పుడుదాకా కరెంటు ఆపుకొని పనులు చేసుకున్రు. అలు ఆపీసిన తర్వాత....ఇదిగో ఈలు తొంగుండిసరికి ఇక్కడి కెలిపొచ్చింది"— అన్నాడు. సుబ్బారావ్‌కి మరొక సందేహమొచ్చింది— "మన గూడకి ఎప్పుడొత్తాదో ?....ఈ కరెంటు" అన్నాడు.

ఆ పెసిని యెంకన్న గుండికాయ పిసికి నట్టగయింది—

"వత్తాదిరా మళ్ళీ రత్తం పారితే వత్తాదిరా ! రాక మానాదా ! మన గూడకే కాదు మన పోడు మీద గుడిసికి కూడా వత్తాదిరా !

అప్పుడు వందల మంది తూటా తుపాకులకి బలైపోతే అదొచ్చిందిరా ! అదేకాదు ఈ రోడ్లూ, కరెంటు, అంగలబడి, కారపరేషన్లు అన్నీ వచ్చినాయి.

తిరగబడినట్టగ కనబడినోడికి బొక్కల తోసీనారు. పల్లకున్నోనికి మళ్ళీ తిరగబడకుండా ఇవి ఇచ్చినార్రా....గుద్దకాడ సిక్కీసి ఉయ్యాలూపినార్రా....

అవి బెలుగుతన్నయంతే.... అందల రత్తముందిరా.... అందల పేణముందరా అందకొండల బట్టీసిన మన జాతోలు ఏడుపుందిరా....

ఓరే సుబ్బా ! మీ యమ్మని కుడిచేత్తోటి సంపీసి, ఎడమచేత్తోటి పాలిచ్చి తాగమంటే తాగుతావరా నువ్వూ....? అలగే చేసినార్రా. సంపీసి సాపుకర్సు ఇచ్చినార్రా— ఏనికిరా మనకవి ? ఆ రోడ్డులమీద మన బళ్ళు తిరగాలా? మన బక్కలు తిరగాలా ?

1171

అదిగో ఇప్పుడొచ్చినట్టగ ఆ జవాస్లు జయ్యీమని రాడానికి, జయ్యీమని పోడానికే ఏసినార్రా....వెలగని తంబా వేసినారు....ఏలరా అవీ పగడాలు కొడుకు పారియ్య చెయ్యి చుట్టీడానికే....ముసిలోలు చీకట్లోన ముంజూరు దూరొత్తే బుర్రలు పగిలి పోడానికిరా....

వద్దురా మీ చినతాతని చంపీసిన ఆ కరెంటు ! మనకొద్దురా నాకు జెయిలు పాలజేసి మీకు దిక్కునేనోల్ని జేసిన ఆ కరెంటు మనకొద్దురా" మన బారిడి మేస్త్రిని చంపేసి, మనచేతి లెట్టిన ఆ కరెంటు మనకొద్దురా" అన్నాడు. ఎంతో బాధగా.... కోడలికి ఏదో గుర్తుకొచ్చింది—

"మ్మామా.... నీలకంఠాపురం సోములికి అప్పుడే పంపీసినారు కదమామా" అన్నాది. వాళ్ళమ్మ ఎపుడూ సోములు గురించే చెప్పేది. గబగబొచ్చి తినేసి ఎలి పోయడని, ఎప్పుడూ పోలీసులు వెలికోలవి చెప్పేది. అందుకే అలగ అడిగింది.

"అవునూ.... అగవాటా కడవర్లోన చంపీసినారు.... ఆడు మన కొంతమీదో లికి గురువు లాటోడు. ఆడంతే ఇప్పుడొచ్చిన నాటోలు పదొంతులైనా ఉచ్చలు బోసు కునోలు" అన్నాడు గతం గుర్తుచేసుకుంటూ—

నోరొదిలేసి వింటున్న సుబ్బారావు ఒక్కసారి—

"అంతే మన జాతోలందరినీ ఒక దగ్గర కూకుండబెట్టి బడి చెప్పోడా ?" అన్నాడు యెంకన్న నవ్వి—

"బడి చెప్పినోలందరూ గురువులు కాదురా....ఆలందరూ 'కూడునేదు గురువా అంతే పులుసేసుకొని బుక్కిమన్నోలే'. అన్నం ఎలా తేవాలో చెప్పర్రా. నెలకో పాలొచ్చి అచ్చర మెలాగదిద్దాలో చెప్పుతార్రా....

గుర్వులంతే గుర్వులు....అపులు గుర్వులురా— వెంపల్లి సత్తిం గుర్వు (వెంపటాపు) ! కారోల్ల కైల్సం గుర్వు ! మేరింగి చిన్నమనాష్టు గుర్వు....ఇంకా ....తుల్సొలస నాయిడోల్సలో అయిదుగుర్ని చంపేసి తిరిగొత్తుండగా దొర్కి పోయిన మేడొరపు రవనమూరితి గుర్వు. అంతేగాని బడి చెప్పీసిన ప్రతీవక్కడు గురుపై పోడు". అనీసి మంచంకోడి పక్కన చుట్టపీకకోసం తడిమాడు—

అదక్కడ నేదు. పోవ్వాకు కేజి డబ్బీ రూపాయలు అయితే కేవొచ్చినప్పు డల్లా ఒక బుక్క పీలుత్తానంతే ఎక్కడ తేగల్బు పక్కమంచమీదున్న కొడుకు చుట్ట పీల్చాడు. →

1172